క్లుప్తంగా

27న సర్వసభ్య సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 27న ఉదయం 11.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

దహెగాం: కొత్తగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏఈవో శోభన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో దరఖాస్తులు స్వీకరించారు. రైతులు రైతుబీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: అర్హులైన రైతులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏఈవో వెంకటేశ్ అన్నారు. మంగళవారం రణవెల్లి, లంబడిహెట్టి గ్రామాల్లో రైతుల వద్ద నుంచి వివరాలు సేకరించారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మిరప నారుమడులు పరిశీలన

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామ శివారులోని మిరప నారుమడులను ఏఈవో చౌదరి అంజన్న మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప నారుకు వడలు తెగులు సోకిందన్నారు. తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు, ఒక లీటర్ నీటిలో కలిపి నేల తడిచేలా నారుపై పిచికారీ చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో మంగళవారం డ్రైడేలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఇంటింటికీ తిరిగి మురికి నీటిని తొలగించారు. మురికి నాలాలు సైతం శుభ్రం చేయించారు. మురికి నాలాల్లో నీటి నిల్వల వద్ద ఆయిల్ బాల్స్ వేశారు.

పీఆర్సీ కమిటీ వేయాలి

వాంకిడి: పీఆర్సీ కమిటీ వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలని పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడె ప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో 2023 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్డులను కార్పొరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటయ్యేలా రూపొందించాలని, పెండింగ్ బిల్లుల బకాయిలను చెల్లించాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు ఉప్రే వినేష్, ప్రధాన కార్యదర్శి జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేయండి

కెరమెరి: ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి చిన్న, సన్నకారు రైతులు ఈ నెల 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదెకరాల లోపు సాగు భూమి, బోరు లేదా బావి కలిగి ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. జాబ్ కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులు అర్హులని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఏఈవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలకు, ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కాగజ్‌నగర్‌టౌన్/ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే -ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డు పంపించారు. ప్రకాష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రెన్యూవల్ ఉత్తర్వులపై అధ్యాపకుల హర్షం

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు ఇంటర్మీడియెట్ బోర్డు మంగళవారం ఇచ్చిన రెన్యూవల్ ఉత్తర్వులపై అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల నుంచి పని చేస్తున్న తమను రెన్యూవల్ చేయించడానికి కృషి చేసిన లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డితో పాటు ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలతో సతమతం..!

- రహదారి పనులతో కొత్త సమస్యలు
- డ్రెయినేజీలు లేక ఇళ్ల మధ్యకు వరద
- అధికారుల సమన్వయలోపంతో ప్రజలకు ఇబ్బందులు



చింతలమానెపల్లిలో ఇంట్లో నిలిచిన నీరు

చింతలమానెపల్లి: మండలంలో పలు అభివృద్ధి పనులను అధికారులు ప్రణాళిక లేకుండా చేపట్టడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రుద్రాపూర్ నుంచి చింతలమానెపల్లి మీదుగా బాలాజీ అనుకోడ శివారు వరకు రహదారి అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతోపాటు రణవెల్లి గ్రామంలో సైతం రోడ్డు నిర్మాణ పనులు నిర్వహించారు. ఇందులో భాగంగా రుద్రాపూర్, మండల కేంద్రం చింతలమానెపల్లి, రణవెల్లిలో రహదారులను నూతనంగా నిర్మించడంతో పాటు విస్తరించారు.

ప్రణాళిక లేని పనులు..

ఆయా గ్రామాల్లో రహదారి పనులు ప్రారంభించే నాటికి డ్రెయినేజీలు లేవు. మురుగునీరు రహదారులపై నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ పరిస్థితుల్లో రహదారుల అభివృద్ధి పనులు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అయితే రహదారులను అభివృద్ధి, విస్తరించేందుకు ప్రణాళికలు వేసిన అధికారులు ఆయా గ్రామాల్లో పరిస్థితులను పరిగణలోకి తీసుకోలేదు. చింతలమానెపల్లి, రుద్రాపూర్ గ్రామాల్లో ప్రధాన వీధుల నుంచి రహదారి నిర్మాణం చేపట్టగా స్థానికుల అభిప్రాయాలు పట్టించుకోలేదు. గ్రామ పంచాయతీ అధికారుల సమన్వయం లేకుండా పనులు నిర్వహించడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. కొత్త రహదారులను అప్పటికే ఉన్న రహదారుల కంటే ఎత్తులో నిర్మించారు. గ్రామాల్లోని అంతర్గత రహదారులు, చిన్న గల్లీలను పరిగణలోకి తీసుకోకపోవడంతో రహదారులు కలిసే చోట లోతట్టుగా మారింది. డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షం పడిన సమయంలో రోడ్లపై నీరు నిలవడంతోపాటు ఇళ్లలోకి వరద చేరుతోంది. రోజుల తరబడి నిలుస్తోన్న వరద నీటితో చింతలమానెపల్లి, రుద్రాపూర్ గ్రామాల్లో సుమారు 100కు పైగా కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. మరోవైపు రహదారి పక్కన చిరువ్యాపారుల దుకాణాల్లోని వస్తువులు వరద నీటితో తడిసి పోతున్నాయి. రణవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సైతం నీరు నిలవడంతో పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. డ్రెయినేజీలు నిర్మించి నీరు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

చింతలమానెపల్లిలోని పలువురి ఇళ్ల నుంచి నీరు తొలగించేందుకు చర్యలు చేపట్టాం. నీటిని తొలగించేందుకు జేసీబీతో కాలువలు తవ్వించాం. అధికారుల సహకారంతో వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– ఆసిఫ్ అలీ, పంచాయతీ కార్యదర్శి, చింతలమానెపల్లి

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: గత కొన్ని రోజులుగా అనారోగ్యం (పక్షవాతం)తో బాధపడుతున్న మండలంలోని గుండి గ్రామానికి చెందిన కొదురుపాక పోశయ్య కుటుంబానికి మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇస్తారి, మండల అధ్యక్షుడు సిద్దేశ్వర్, నాయకులు సురేశ్, సత్యనారాయణ, దీపక్, వెంకటేష్, సురేందర్, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలని వేడుకోలు..

వృత్తి పని చేసుకుంటూ జీవనం సాగించే పోశయ్యకు మేలో పక్షవాతం వచ్చి కాళ్లు, చేతులు పడిపోయాయి. ఏ పని చేయలేని పరిస్థితుల్లో పిల్లలు లేకపోవడంతో వృద్ధురాలైన భార్య కూలి పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని దీన స్థితిలో వారు ఉన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని కనీసం పెన్షన్ వచ్చేలా చూడాలని పోశన్న వేడుకుంటున్నాడు. పెద్ద మనస్సుతో దాతలు తమను ఆదుకోవాలని కోరుతున్నాడు.

దాతలు సాయం చేయాలనుకుంటే..

పేరు: కిరణ్
ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్ 9704984634,
బ్యాంకు ఖాతా నంబర్ 34231671768,
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020126
ఆసిఫాబాద్ బ్రాంచ్, ఎస్‌బీఐ

ఎరువుల దుకాణాల్లో స్టాక్‌బోర్డులు పెట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి: మండలంలోని ఎరువులు, మందుల దుకాణాల్లో స్టాక్ బోర్డులు పెట్టేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దుర్గం జీవన్ అన్నారు. ఈమేరకు మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఈవో మానసకు వినతిపత్రం అందజేశారు. ఎరువులు, పురుగుల మందులను ఎంఆర్పీ రేట్ల కంటే అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, వెంటనే సంబంధిత దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ ప్రచార కార్యదర్శి సామల రమేశ్ ఉన్నారు.

‘చలో ఇందిరా పార్క్’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కెరమెరి: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 29న నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షకు 317జీవో బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని సంఘం బాధ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ‘చలో ఇందిరాపార్క్’ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సొంత జిల్లాలను వదిలి ఇతర జిల్లాలకు శాశ్వతంగా కేటాయించడం వల్ల తమకు తీరని అన్యాయం జరిగిందన్నారు. తక్షణమే తమ జిల్లాలకు కేటాయించాలని కోరారు. హెచ్ఎం ఆడే ప్రకాశ్, ఉపాధ్యాయులు క్రాంతి కుమార్, శ్రీకాంత్, వినోద్, బాలకృష్ణ, శివప్రసాద్, కృష్ణకాంత్, ఆకాశ్, సంతోష్, లింగయ్య, వివేక్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

కెరమెరి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ ఏపీవో మ ల్లయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని కెనాల్ తీరంలో గుంతలు తవ్వి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు తమ పొలాల్లో తప్పకుండా మొక్కలు నాటాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

టీచర్లు సమయపాలన పాటించాలి

కెరమెరి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కెలి(బి), కెలి(కే), పెద్ద సాకడ గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సందర్శించారు. ప్రతీరోజు బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సురక్ష యోజన బీమా పథకాన్ని బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు ఆడిటర్ మోహన్ అన్నారు. మంగళవారం కౌటాల తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి, సిబ్బంది మనోహర్, రాజేశ్, సీఎస్పీలు ప్రకాశ్, మోరేశ్వర్, లక్ష్మీనారాయణ, విలాస్ ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కౌటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం మండలంలోని వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ వీఆర్ఏలను క్రమబద్ధీకరించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఏలు రేవంజీ, ప్రకాశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

వాంకిడి: మండలంలోని లక్ష్మీపూర్ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు పాఠశాలలో డెప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు నూతి అభిలాష్ విద్యా సామగ్రి అందజేశారు. విద్యార్థుల ఆర్థిక పరిస్థితులను గమనించి వారికి నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు సొంత డబ్బులతో కొనుగోలు చేసి 33 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ



కెరమెరిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కెరమెరి: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరిగిన ఘటనకు నిరసనగా మంగళవారం మండల కేంద్రంలో పార్టీలు, సంఘాలకు అతీతంగా ర్యాలీ నిర్వహించారు. పలువురు నేతలు మాట్లాడారు. మణిపూర్ ఘటన దేశానికి అవమానకరమన్నారు. నిందితులకు ఉరిశిక్ష వేయాలని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, అనార్‌పల్లి సర్పంచ్ శేశారావు, ఉపసర్పంచ్ నిసార్ అహ్మద్, హెచ్ఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుజాయత్ ఖాన్, నాయకులు ఖుద్దూస్, వినేష్, ఆనంద్‌రావు, మారుతి, వెంకటేశ్, భరత్, మహేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

‘మణిపూర్‌ను కాపాడటంలో కేంద్రం విఫలం’

కాగజ్‌నగర్‌టౌన్: మణిపూర్‌ను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఎస్పీ, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం బహుజన సమాజ్ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా మణిపూర్ ఉదాంతంపై నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



ఆసిఫాబాద్‌అర్బన్: ఆవుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామపంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని చేపట్టిన సమ్మె మంగళవారం 20వ రోజుకు చేరింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆవుకు కార్మికులు వినతిపత్రాన్ని అందజేసి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాజు, సమ్మయ్య, నాగేశ్వర్, కై లాస్, మహేష్, పెంటుబాయి, యమున, కార్మికులు పాల్గొన్నారు.

దహెగాం: జీపీ కార్మికులు న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం కొనసాగింది. కార్మికులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, వెంకటి, రాజం, రాజు, మారుతి, ధనూజీ, వెంకటేశ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 20వ రోజు మంగళవారం కొనసాగింది. కార్మికులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి వెట్టిచాకిరి చేస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికులు నాగేశ్, రవి, ప్రకాశ్, పోచయ్య, శంకర్, లింగయ్య పాల్గొన్నారు.

వాంకిడి: గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్లుగా పని చేస్తున్న కార్మికులు తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 20వ రోజుకు చేరుకుంది. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా నోట్లో గడ్డి వేసుకుని వినూత్నంగా నిరసన తెలిపారు.

రెబ్బెన: డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టిన పంచాయతీ కార్మికులు మంగళవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అంతకు ముందు దీక్ష శిబిరం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో మూతికి నల్లగుడ్డ కట్టుకుని నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు ఉపేందర్, సుధాకర్, వెంకటేష్, రమేశ్, శంకర్, ప్రకాష్, సునీల్, శ్రీనివాస్, ధర్మయ్య, పోచయ్య, మహేందర్, శోభ, లక్ష్మి, రాజేశ్వరీ, లాలు పాల్గొన్నారు.

‘సరిహద్దు’ పంచాయతీల్లో పర్యటన



పాలను పరిశీలిస్తున్న ఎంపీపీ

కెరమెరి: మండలంలోని మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న వివాదాస్పద గ్రామ పంచాయతీలు పరంధోళి, ముకదంగూడలలో మంగళవారం ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఎంపీడీవో మహేందర్‌లు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ముకదంగూడ అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వఉన్న సరుకుల నాణ్యతతో పాటు పరంధోళిలో మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. సర్పంచ్ లింబాదాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు ఉన్నారు.

ఐకేపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గోరంట్ల విజయ్

బెజ్జూర్: ఐకేపీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షుడు గోరంట్ల విజయ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 17965 మంది ఐకేపీ వీవోఏలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారికి వెంటనే వేతనాలు పెంచి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గౌరవ అధ్యక్షుడు తొర్రెం శ్యామ్ సుందర్, కార్యదర్శి పొట్టే విలాస్, ఉపాధ్యక్షుడు ముంజం కేశవ్, ప్రధాన కార్యదర్శి పెద్దల సంతోష్, సహాయ కార్యదర్శి కోడెప సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పోలీసుల చేయూత



సరుకులు, నగదు అందజేస్తున్న ఎస్సై భూమేశ్

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌కు చెందిన నిరుపేద నాయిని వెంకటి ఇల్లు ఇటీవల కురిసిన వర్షాలకు నేలమట్టం కాగా మంగళవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా రెబ్బెన పోలీసులు బాధిత కుటుంబానికి చేయూతనందించారు. రెబ్బెన ఎస్సై భూమేశ్ మంగళవారం బాధితుడి ఇంటికెళ్లి నెలకు సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు, రూ.1000 నగదు అందజేశారు. నాయకులు పందిర్ల మధునయ్య, వినోద్, సంజీవ్ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



పంక్చర్ షాపులోకి దూసుకెళ్లిన కారు

తిర్యాణి: మండలంలోని చింతపెల్లి రైస్‌మిల్ సమీపంలో చింతపెల్లి నుంచి తిర్యాణి వైపునకు వెళ్తున్న కారు అదుపుతప్పి పంక్చర్ షాపులోకి దూసుకెళ్లిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కాగా ప్రమాదం జరిగిన సమయంలో పంక్చర్ షాపులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా కారులో ఐదుగురు యువకులు మద్యం సేవించి నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

కాగజ్‌నగర్‌రూరల్: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. మండలంలోని మావోయిస్టు ప్రభావిత గ్రామం నారాపూర్‌లో మంగళవారం రాత్రి నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడవాలన్నారు. అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై సోనియా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టుపై నుంచి నీటి ప్రవాహం



సాంగ్వి కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న నీరు

కెరమెరి: మండలంలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, నదులు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని సాంగ్వి, ఇంద్రానగర్, కెలికే గ్రామాల సమీపంలో ఉన్న కల్వర్టులపై నుంచి నీరు ప్రవహించడంతో ఉద్యోగులు తమ విధులకు హాజరుకాలేకపోయారు. ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. మధ్యాహ్నం తర్వాత ప్రవాహం తగ్గడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం

బెజ్జూర్: బదిలీపై జిల్లా కేంద్రానికి వెళ్తున్న ఎస్సై వెంకటేష్‌ను మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎస్సై చేసిన కృషి అభినందనీయమని వారు కొనియాడారు. అనంతరం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన విక్రమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సకారాం, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగా ఓంప్రకాష్ నాయకులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న ట్రస్ట్ సభ్యులు

కౌటాల: టాటా ట్రస్ట్ బృందం సభ్యులు మంగళవారం మండలంలోని గుడ్లబోరి, కనికి, సాండ్‌గాం గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసి స్థానిక రైతులు, స్వయం సహాయక సంఘం సభ్యులతో మాట్లాడారు. పంటల సాగుతో ఆర్థిక పరిస్థితులపై ఆరా తీశారు. చేపల పెంపకం, డైరీ, కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉందని కొందరు రైతులు తెలపగా పూర్తి స్థాయిలో సర్వే చేసి ఆసక్తి కలిగిన రైతులకు సాయం అందిస్తామన్నారు. సమావేశాల్లో టాటా ట్రస్ట్ బృందం రాష్ట్ర ఆర్ఎం భగీరథ, సభ్యులు చిటోరీ వాసు, సుస్మిత, పద్మాకర్, ఏపీడీ శ్రీనివాస్, ఏపీఎం వెంకటరమణ, ఏవో రాజేశ్, ఏఈవోలు దుర్గభవాని, రస్మిత, శ్రీలత, సర్పంచులు పాలే రాందాస్, ఏకోనకర్ దామోదర్ పాల్గొన్నారు.

పోడు భూముల పట్టాలు పంపిణీ



పట్టా పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోడుభూముల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో మల్లిఖార్జున్ యాదవ్ లబ్ధిదారులకు పట్టాపాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం పోడు రైతులకు పట్టాలు ఇచ్చి మాట నిలుపుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, వైస్ ఎంపీపీ సుంకరి మంగ, నాయకులు కిష్టయ్య, పెంటయ్య, శంకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.